క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: హనుమకొండ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీ వద్ద అమృత్ మిషన్ భగీరథకు చెందిన వాల్వ్ మరమ్మతుకు గురైందని, ఈక్రమంలో గురువారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం, శ్రీనివాస కాలనీ, అడ్వకేట్స్ కాలనీ ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్ ఉంటుందని పేర్కొన్నారు. మర్నాడు యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సగర కాలనీ, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, దర్గా, హౌసింగ్ బోర్డు కాలనీ, బియాబాని నగర్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దామెర విజయ్‌కుమార్‌కు గానకోకిల పురస్కారం



వరంగల్: ఉద్యమ గాయకుడు, ధూంధాం ప్రజా కళాకారుడు దామెర విజయ్ కుమార్.. ఉద్యమ గానకోకిల పురస్కారానికి ఎంపికైనట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఈనెల 12న నిర్వహించనున్న ఆవిర్భావ సమావేశంలో ఉద్యమ నాయకులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

సముద్రాల పురుషోత్తమాచార్యులు కన్నుమూత



పురుషోత్తమాచార్యులు (ఫైల్)

హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆలయ ఆస్థానాచార్యులు సముద్రాల పురుషోత్తమాచార్యులు (87) మంగళవారం రాత్రి కన్నుమూశారు. వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రారంభం నుంచి 40 ఏళ్లపాటు పూజా కార్యక్రమాల విధులు నిర్వహించారు. ముముక్షు తరంగిణి, శ్రీహరి స్తుతి వంటి గ్రంథాలను ఆయన రచించారు. ఆధ్యాత్మికంగానే కాకుండా నీటి పారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందించారు. ఆయన మృతికి అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

వరంగల్ అర్బన్: పూర్తిచేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలంటూ సివిల్ కాంట్రాక్టర్లు కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను బుధవారం కలిసి విన్నవించారు. బిల్లులు చెల్లించకపోతే ఇతర పనులు చేపట్టబోమని తేల్చిచెప్పారు. గతంలో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని వెంటబడి పనులు చేయించిన ఇంజినీర్లు.. బిల్లులు ఇప్పించడంలో జోక్యం చేసుకోకపోవడంపై కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్

కాజీపేట: నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ నాగబాబు హెచ్చరించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అదాలత్ సెంటర్‌లో పలువురు వాహనదారులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలకు అనుగుణంగా అన్ని పత్రాలను వాహనదారులు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.

మేకల వంశవేదిక కార్యవర్గం



హసన్‌పర్తి: మేకల వంశవేదిక కార్యవర్గాన్ని ఇందిరా కాలనీలో ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా 66వ డివిజన్ హసన్‌పర్తికి చెందిన మేకల యుగంధర్, ఉపాధ్యక్షులుగా రమేష్, శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా హరిశంకర్, సహాయ కార్యదర్శిగా రాజేందర్, కోశాధికారిగా శోభన్, సహాయ కోశాధికారిగా రాజు, కార్యదర్శులుగా సిద్ధార్థ, రాజేందర్, భరత్, ప్రకాష్, వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని యోగా గురువు జంగా గోపాల్‌రెడ్డి సూచించారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో పలువురికి బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా టీచర్ శ్రీనివాస్, సైకిల్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి అనంత్, యోగా సభ్యులు నరహరి, ఉపేందర్, లత, దివ్య, రోజా, కల్యాణి, విజయరాణి, అఖిల, మాలతి, శోభ, సమ్మయ్య, అశోక్, రాజు పాల్గొన్నారు.

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు సరికాదు



హన్మకొండ అర్బన్: కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



కాజీపేట తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

హన్మకొండ అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లారం సంపత్ డిమాండ్ చేశారు. 'డిమాండ్ డే' సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న ప్రైవేటీకరణ విధానాలు, లేబర్ కోర్డులు, బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్‌లో ఆమోదించిన నాలుగు లేబర్ కోర్డులు, బొగ్గు బ్లాక్ వేలం వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆలకుంట యాకయ్య, యాస బాబు, సుధాకర్, రవి, మంజుల, శ్రీలత, శారద, రమాదేవి, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కాజీపేట అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బావ్‌సింగ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కారు ఉపేందర్, నాయకులు విజయ్, మౌలి, రాజు, భవని, వెంకటేష్, సాంబయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాపాడుకుందాం



వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, కార్మికుల హక్కులను కాపాడుకుందామని ట్రాలీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండీ.మహబూబ్‌పాషా అన్నారు. కార్మికుల కోరికల దినమైన జులై 10న పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ట్రాన్స్‌పోర్టర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ.. గత పదేళ్లుగా సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాపాడేందుకు కార్మిక పోరాటాలు ఉధృతం చేయాలని సీఐటీయూ జాతీయ కమిటీ నిర్ణయం తీసుకుందని వివరించారు. యూనియన్ నాయకులు సదానందం, ఫయాజ్, బాబా, రజాక్, యాస్మాన్‌ఖాన్, జమాషేక్ పాల్గొన్నారు.

శిథిల భవనాలను కూల్చేయండి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ అర్బన్: నగరంలో శిథిల భవనాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని మేయర్ గుండు సుధారాణి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో.. బల్దియా వ్యాప్తంగా ఉన్న 66 డివిజన్లలో గతంలో గుర్తించిన, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాలకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని, శిథిలావస్థకు చేరిన భవనాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. రాబోయే 4 నెలల కాలంలో సెల్లార్ల నిర్మాణాలు చేపట్టకుండా (తవ్వకుండా) కఠినంగా వ్యవహరించాలన్నారు. సెల్లార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలు (ప్యానల్ బోర్డులు) ఉంటే.. వాటిని వెంటనే మొదటి అంతస్తులో ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రీవెన్స్ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, జలీల్, ఐటీ మేనేజర్ రమేశ్, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

పకడ్బందీగా సంక్షేమ పథకాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కాశోజీ సెంటర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలుకు చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులు, పథకాల అమలు పురోగతిపై ఆయా శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యంలో 45 శాతం మొక్కలు నాటినట్లు తెలిపారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా 438 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి, 232 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న చలపతి రావు



జయగిరిలో రోటరీ క్లబ్ సభ్యులు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ సదానందం సహకారంతో సుమారు రూ.37 వేల విలువ గల నోట్‌బుక్స్, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి డి.చలపతి రావు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయగిరి పాఠశాలలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం జయగిరి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో రూ.25వేల విలువైన నోట్‌బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని వివరించారు. విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రావు, వైస్ ప్రెసిడెంట్ వంగా రాజిరెడ్డి, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ జి.నరేష్, కోశాధికారి అంచూరి విజయ్‌కుమార్, క్లబ్ ట్రైనర్ సతీష్‌కుమార్, సభ్యులు రవీందర్‌రెడ్డి, మోహన్, ఉపాధ్యాయులు శ్రీహరి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి ఆర్థిక చేయూత



వరంగల్ స్పోర్ట్స్: ఏషియన్ జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌నకు ఎన్నికైన హనుమకొండ స్పోర్ట్స్ హాస్టల్ క్రీడాకారుడు బొమ్మరాజు శివాజీకి హనుమకొండ పారాబాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి జగన్‌రావు రూ.51,116 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈమేరకు చెక్కును కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈనెల 14 నుంచి జోర్డాన్ దేశంలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో భారత జట్టులో ఓ సభ్యుడిగా శివాజీ ఆడనున్నాడు. కార్యక్రమంలో డీఎస్‌ఏ హ్యాండ్‌బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

విభాగాధిపతిపై చర్య తీసుకోవాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్‌ఎం విభాగం అధిపతిపై చర్య తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) కేయూ అధ్యక్షుడు గణేష్ డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని న్యూ పీజీ హాస్టల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ నాయకుడు మర్రి మహేష్‌పై ఆ విభాగం అధిపతి దుర్భాషలాడారని ఆరోపించారు. సమావేశంలో రఘు, మహేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లయ్యను కలిసిన నాయకులు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబల్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను కాంగ్రెస్ ఎస్టీ విభాగం వరంగల్ జిల్లా చైర్మన్ గుగులోతు రవీందర్ నాయక్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జవాన్ల బదిలీలు నిలిపి వేయాలి

నయీంనగర్: సఫాయి జవాన్లు, కార్మికుల బదిలీలు నిలిపివేయాలని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం తరఫున టీఎమ్మార్పీఎస్ నాయకులు బొట్ల భిక్షపతి మాదిగ, ఏల్పుల ధర్మరాజు కోరారు. ఈమేరకు కుడా కాంప్లెక్స్ కార్యాలయంలో ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

ఆపిల్ ప్లే స్కూల్‌లో ఫ్రెషర్స్ డే



కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్‌లోని ఆపిల్ ప్లే స్కూల్‌లో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, డైరెక్టర్ రాజు, ఉపాధ్యాయులు, రమ్య, శ్రావణి, మల్లిక, విక్టోరియా, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ధర్నాలో మాట్లాడుతున్న ధర్మారావు

కాశోజీ సెంటర్: ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. కౌలు రైతులకు రైతు భరోసా నేటికీ ఇవ్వలేదని మండిపడ్డారు. రైతు గోస తగలడంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దిగిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళిదాసు, రఘునారెడ్డి, బాకం హరికృష్ణ, గందె నవీన్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్, వైద్యులు

ఖిలా వరంగల్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ఆర్‌తోట పీహెచ్‌సీ వైద్యురాలు అనిత, కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్ఆర్‌తోట పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని, చేతులను తరుచుగా శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. తొలుత పాఠశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ బుర్ర మురళి, ప్రైమరీ హైస్కూల్ ఇన్‌చార్జ్ జయప్రకాశ్, ఎండీ.అక్తర్, వైద్య సిబ్బంది మంజుల, మౌనిక, ప్రభాకర్, పద్మ, వీణ కృష్ణవేణి, ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబ్జా చేస్తే ఎవరినైనా వదిలిపెట్టను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: సర్కార్ భూములను కబ్జా చేస్తే సహించేది లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హెచ్చరించారు. అందులో తన కొడుకు ప్రమేయం ఉన్నా వదిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హసన్‌పర్తి మండలంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సంస్కృతి విహార్‌లో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ఇచ్చిన మేరకు కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సర్కార్ ముందుకు సాగుతోందని వివరించారు. వర్ధన్నపేటలో ఇంటిగ్రేటెడ్ స్టడీ సర్కిల్ మంజూరైందని, హసన్‌పర్తిలో ఇండోర్ స్టేడియానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రజిత, దివ్యారాణి, అరుణకుమారి, పీఏసీఎస్ చైర్మన్లు బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, మేర్గు రాజేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో నారాయణస్వామి, వైద్యులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణ స్వామి పర్యవేక్షణలో రైల్వే రెఫరల్ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు, రైల్వే వైద్యులు శిబిరంలో పాల్గొని సిబ్బంది, అధికారులకు వైద్య పరీక్షలు చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతరెడ్డి, జనరల్ ఫిజీషియన్ రవికిరణ్‌రెడ్డి, ఆర్థోపెడిషియన్ ఉత్తమ్ కుమార్, గైనకాలజిస్ట్ డోనా, రైల్వే వైద్యులు హరిబాబు, ధీరజ్‌కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు చేసినట్లు రైల్వే ఆస్పత్రి ఎంఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జంగాకు అభినందనలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మడికొండ / కాజీపేట అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్, గ్రోవర్స్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన జంగా రాఘవరెడ్డికి కాంగ్రెస్ కాజీపేట మండల నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కడిపికొండ గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్, 44వ డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి, 45వ డివిజన్ యూత్ నాయకులు సంతోష్, బస్కె ప్రణయ్, ఉబ్బని వెంకటస్వామి, లింగమూర్తి పాల్గొన్నారు.

రాఘవరెడ్డిని కలిసిన 'మార్నేని'

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వహ్నివాసినిగా రాజరాజేశ్వరి



హన్మకొండ కల్చరల్: శాకంబరి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని వహ్నివాసిని నిత్యగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఝల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అర్చనలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం మహాహారతి, భోజన ప్రసాదాల వితరణ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి

హన్మకొండ: అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి సదరు రైతులకు శాశ్వత హక్కులు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కలకోటి మహేందర్ కోరారు. ఈమేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో పీఓటీ చట్టం –1977 ప్రకారం అలాంటి భూములను అమ్మడానికి, కొనుగోలు చేయడానికి, బ్యాంకులో తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి అవకాశం లేకపోవడంతో పేదలు, అసైన్డ్ రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

'పొంగులేటి'ని కలిసిన టీజీఓ నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన రెవెన్యూ, ఇతర డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను ఆయా జిల్లాలకు బదిలీ చేయాలని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టీజీఓ భవనానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర బాధ్యులు పరమేశ్వర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

'నాయకులు క్షమాపణ చెప్పాలి'

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ నాయకులు నిరంజన్, విజయశాంతి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని టీటీడీపీ రాష్ట్ర నాయకులు గట్టు ప్రసాద్‌బాబు, హనుమకొండ సాంబయ్య డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ పర్యటనలో భాగంగా తెలంగాణలో పాగా వేయడానికి చంద్రబాబు నాయుడు ప్లాన్ చేస్తున్నారని నాయకులు విమర్శించడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరపాక ప్రభాకర్, బర్ల యాకూబ్, రేపూరి వెంకట్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యలపై పోరాడే వ్యక్తి'

హన్మకొండ అర్బన్: ఉద్యోగుల సమస్యలపై అనునిత్యం పోరాడే వ్యక్తి టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ అని సంఘం నాయకులు కొనియాడారు. ముజీబ్ హుస్సేనీ జన్మదిన వేడుకలను బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, జిల్లా నాయకులు సలీం, సురేష్, రాజేష్ ఖన్నా, రాజీవ్ అనూప్, ప్రణయ్, పృథ్వీ, పైడి రాజు, భగవాన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఫాతిమా, శ్రీనివాస్, లక్ష్మణ్, ఆజీమ్, మిస్బా, వెంకన్న పాల్గొన్నారు.